క్లుప్తంగా

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని టీఎస్‌బ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందన్నారు.

నేడు అయ్యప్ప పడిపూజ

బోథ్: సొనాలలోని రామాయలంలో సోమవారం మహా పడిపూజ నిర్వహించనున్నట్లు సొనాల అయ్యప్ప సేవ సమితి సభ్యులు పేర్కొన్నారు. మండలంతో పాటు ఆయా గ్రామాల అయ్యప్ప స్వాములు, భక్తులు మహాపడి పూజలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాటన్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బేల: మండలంలోని పాటన్ గ్రామంలో సైద్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫైజుల్లాఖాన్, మెడికల్ సూపర్‌వైజర్ అనుసూయ, వైద్య సిబ్బంది దీక్షరాణి, లక్ష్మి, రూపాలి, ఆశ వర్కర్లు, తదితరులు, పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

బేల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ కాలనీలో స్థానిక విశ్వకర్మ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ ఆలయంలో దగ్గులావ్వ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు విశ్వనాథ్ బుహా ప్రత్యేక హోమం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు విష్ణుదాస్, స్వప్నిల్, అశోక్, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన నిర్వహణపై గ్రామసభ

నార్నూర్: ప్రజాపాలన దరఖాస్తులను ఉచితంగా అందించాలని సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన దరఖాస్తు ఫారాలను అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. ఈనెల 2న మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, అదర్శ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రాథోడ్ సుభాష్, జెడ్పీ స్కూల్ చైర్మన్ గణేశ్, పంచాయతీ కార్యదర్శి దినేష్ పాల్గొన్నారు.

పురుషులకు ప్రత్యేక బస్సులు కేటాయించాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఇతర ప్రయాణికులకు ఇబ్బంది అవుతుందని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్‌కుమార్ మాదిగ ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ బస్సుల్లో ప్రయాణించే పురుషులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని కోరారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్: పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నదాన చేపట్టడం అభినందనీయమని నార్నూర్ ఎంపీటీసీ పరమేశ్వర్, అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్బాత్‌లు అన్నారు. సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ట్రస్ట్ సభ్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, సింగం, మహేందర్ రెడ్డి, సలీమ్ శుభాష్, రాజయ్య, అంబయ్య, లఖన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా మెస్రం వంశీయులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగోబా దర్బార్ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంవో శ్రీధర్, పిట్టబొంగరం వైద్యాధికారి ప్రతాప్‌నాయక్, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, తుకారం, బాదిరావ్ పటేల్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, సోనేరావ్, తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ హంగామా



ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



నేరడిగొండ: కేక్ కట్ చేస్తున్న యువకులు

జిల్లా వ్యాప్తంగా న్యూ ఇయర్ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి.. 2024 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ.. కేరింతలు కొట్టారు. అనంతరం కేక్ కట్ చేసి, నూతన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీజే పాటలకు స్టెప్పులేసి హంగామా చేశారు. పట్టణమంతా టపాసుల వెలుగులతో నిండిపోయింది. బేకరీలు, రెస్టారెంట్లు, చికెట్ సెంటర్ల వద్ద సందడి నెలకొంది. – సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్: చికెన్ 65 తయారు చేస్తున్న వ్యాపారి



నేరడిగొండ: కేక్ దుకాణం వద్ద సందడి



నేరడిగొండ: కేక్ కట్ చేస్తున్న కుటుంబసభ్యులు

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న బుగ్గారం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి.. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాలు



రోడ్డుపై నిలిపిన వాహనాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపై ఇష్టారీతిన వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు 'మహాలక్ష్మి' కష్టాలు

- భారంగా కుటుంబపోషణ
- ఈఎంఐ ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఆటో డ్రైవర్లకు శాపంగా మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో దినమంతా ఆటో నడిపిన పూటగడవని పరిస్థితి నెలకొందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం తరువాత ఆటో డ్రైవర్లు ఆటోలు ఇంట్లో పెట్టి కూలీ పనులు వెళ్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినట్లే ఆటో డ్రైవర్లకు ఆటోబంధు, ఈఎంఐలు చెల్లించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థికంగా ఇబ్బందులు..

ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సుమారు 550పైగా ఆటోలు ఉన్నాయి. ఇంద్రవెల్లి నుంచి ఉట్నూర్, ఇంద్రవెల్లి నుంచి గుడిహత్నూర్, ఆదిలాబాద్‌కు ఆటోలు నడపించి జీవనం సాగిస్తున్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కష్టాలు తెచ్చిపెట్టింది. మహాలక్ష్మి పథకంతో మహిళలు పూర్తిగా ఆటోలు ఎక్కడమే మానేశారు. దీంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి దొరకక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దినమంతా ఆటో నడిపినా.. రూ. 200 రావడం లేదని వాపోతున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు (ఫైల్)

ఆటోబంధు అమలు చేయాలి

మహాలక్ష్మి పథకం అమలు చేసినట్లే ఆటో డ్రైవర్లకు ఆటోబంధు పథకం అమలు చేయాలని, నెలకు రూ. 4000 అందించడంతో పాటు నెల వారి బ్యాంక్ ఈఎంఐ, ఫైనాన్స్ కిస్తీలను ప్రభుత్వమే చెల్లించే విధంగా పథకం రూపొందించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి దారుణంగా మారింది. ఆటోను నమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్నా.. కనీసం రూ. 200 కూడా రాకపోవడంతో కూలికి వెళ్లే పరిస్థితి నెలకొంది.
– గాయక్‌వాడ్ భారత్, ఆటో డ్రైవర్

ఆటో ఎక్కడం లేదు



ఐదు సంవత్సరాలుగా ఆటోను నమ్ముకొని బతుకుతున్నా. ప్రతీరోజు రూ. 600 రూపాయలు సంపాదించే వాడిని. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకంతో మహిళలు పూర్తిగా ఆటోలో ప్రయణించడం మానేశారు. ఫైనాన్స్ కట్టాలేక పోతున్న.
– రాజేశ్వర్, గోపాల్‌సింగ్‌తండా

కూలిపనులు చేస్తున్న



గత సంవత్సరం ఫైనాన్స్ ద్వారా ఆటో కొనుగోలు చేశాను. ఆటో నడిపిన డబ్బులతోనే కుటుంబాన్ని పోషిస్తున్నా.. మహాలక్ష్మి పథకంతో రూ. 200 కూడా రావడం లేదు. దీంతో కూలి పనులకు పోతున్నా.
– సోన్‌కాంబ్లే రాజు, కొబ్బయ్‌గూడ

అయోధ్య అక్షింతల శోభాయాత్ర



అయోధ్య అక్షింతలతో గ్రామస్తులు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో అయోధ్య రామ మందిర అక్షింతల శోభాయాత్ర ఆదివారం నిర్వహించారు. ముందుగా విశ్వహిందూ పరిషత్, హిందు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ముత్నూర్ గ్రామం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. ఇందులో ఆదిలాబాద్ గోపాల కృష్ణమఠం మఠాధిపతి యోగనంద సరస్వతి స్వామిజీ, అందు నాయక్‌తండా జ్వాలముఖి ఆలయ మహరాజ్ రామ్‌సింగ్ బాబా, సురేశ్ మహరాజ్, కోరెంగా యేశ్వంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

కూర గ్రామానికి చేరుకున్న అక్షింతలు

జైనథ్: అయోధ్య అక్షింతలు కూర గ్రామానికి చేరుకున్నట్లు గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు, భక్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్షింతలు ఆలయంలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఇంటింటికీ అక్షింతలు అందజేస్తామన్నారు.

ఆసరా పింఛన్లు ఆలస్యం..

- గత నెల 30న పంపిణీ
- ఇబ్బంది పడుతున్న వృద్ధులు, లబ్ధిదారులు

బేల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు ఇచ్చే ఆసరా పింఛన్లు ఆలస్యమవుతున్నాయి. సకాలంలో ఆసరా పింఛన్లు అందడం లేదు. దీంతో సంబంధిత లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పింఛన్ల నిధులు ఆలస్యంగా విడుదలయ్యాయి. దీంతో బేలలో గత నెల 30న పంపిణీ ప్రారంభమైంది. మిగతా చోట్లనూ ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.

సకాలంలో అందని పింఛన్లు..

ప్రతినెల రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు సకాలంలో రావడం లేదు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి 10 తేదీ వరకు పింఛన్ల పంపిణీ చేయాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం వీటికి ఆలస్యంగా నిధులు విడుదల చేయడంతో పింఛన్ల పంపిణీ ప్రతినెల 18వ తేదీ తర్వాత పంపిణీ చేస్తున్నారు. గత ఆరు నెలల నుంచి 22 నుంచి 25 తేదీల్లో జరిగేది.



బేల పోస్టాఫీసు వద్ద లబ్ధిదారులు (ఫైల్)

ఈసారి మరింత ఆలస్యంగా పింఛన్ల నిధులు 28న విడుదలయ్యాయి.

ఆలస్యంగా పంపిణీ..

పింఛన్ నగదును జైనథ్ మండలంలోని గిమ్మ సబ్ పోస్టాఫీసులో గత నెల 30న అందజేశారు. హుటాహుటిన బేలలో పోస్ట్‌మాస్టర్ 30న సాయంత్రం నుంచే నగదు పంపిణీని ప్రారంభించారు. మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. బేల, సిర్సన్న, చప్రాల, కోగ్దూర్, సాంగిడి, సైద్‌పూర్, తోయగూడ, సదల్‌పూర్, కొబ్బాయి, గూడ(ఎం) గ్రామాల్లోనే పోస్టాఫీసులు ఉన్నాయి. పింఛన్ల పంపిణీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేయాలంటే వారం రోజుల సమయం పడుతుంది. దీంతో లబ్ధిదారులందరికీ పింఛన్లు మరుసటి జనవరి నెల ప్రారంభంలో అందనున్నాయి.

ఆలస్యం అవుతున్నాయి



ప్రతినెల పింఛన్‌ల పంపిణీ ఆలస్యమవుతోంది. ప్రభుత్వం నుంచి పైసలు ఆలస్యంగా వస్తున్నాయని చెబుతున్నారు. గతంలో ప్రతినెల మొదటి వారంలో ఇచ్చేవారు. ఇప్పుడేమో తీవ్ర జాప్యంతో ప్రతినెల చివరి వారంలో ఇస్తున్నారు.
– గంగుబాయి, దోప్టాల

ఇబ్బంది పడుతున్నాం



గత ఆరేడు నెలల నుంచి ప్రతినెల పింఛన్ పైసలు పంపిణీ ఆలస్యమవుతోంది. ప్రభుత్వం గిట్ల ఆలస్యంగా ఇస్తే ఎట్లా. ఈసారైతే నెల చివరి రోజున పింఛన్ ఇచ్చిండ్రు. ప్రతిసారి ఆలస్యమైతే మందులు, గోళీలు, ఇతరత్ర ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం.
– పుసాం బైజబాయి, జూనోని

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మురళీకృష్ణ దేవాలయంలో ఎమ్మెల్యేను సుందర్ సత్సంగ్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువు ఆధ్వర్యంలో సాధన చేస్తే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. ఎమ్మెల్యే గెలుపొందిన అనంతరం చైతన్యానంద స్వామి వారిని దర్శనం చేసుకోవడానికి అన్ని పనులను వదులుకొని హైదరాబాద్ వెళ్లానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

రక్తదానం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా మెస్రం వంశీయులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగోబా దర్బార్ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంవో శ్రీధర్, పిట్టబొంగరం వైద్యాధికారి ప్రతాప్‌నాయక్, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, తుకారం, బాదిరావ్ పటేల్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, సోనేరావ్, తదితరులు పాల్గొన్నారు.

'పరువు పోవద్దనే అవిశ్వాసం వద్దన్నాం'

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపాలిటీ పరువు పోతుందనే ఉద్దేశంతో తాము అవిశ్వాస తీర్మానం వద్దన్నామని.. తిమ్మాపూర్, ఖానాపూర్ వీడీసీ అధ్యక్షులు బీసీ రాజన్న, సతీష్‌రావుదేశ్‌పాండే అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన మున్సిపాలిటీలో చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెడితే పట్టణ ప్రతిష్ఠ దెబ్బతినడంతో అభివృద్ధి పనులు నిలిచిపోతాయనే ఉద్దేశంతో తాము ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్‌కు విన్నవించామని పేర్కొన్నారు. కానీ తాము రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, నాయకులు.. వీడీసీ పెద్దలపై ఎస్పీకి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. మున్సిపాలిటీలో అవినీతి జరిగితే దానికి సభ్యులందరి బాధ్యత ఉండాదా అని ప్రశ్నించారు. అవినీతిపై కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ప్రజల సమక్షంలో చర్చించాలని కోరారు. తాము దాడులు చేస్తామని ఎస్పీకి ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఎస్పీని కలిసి పరిస్థితిని వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కల్వకుంట్ల నారాయణ, ద్యావతి రాజేశ్వర్, కరిపె శ్రీనివాస్, కటికె శ్రీనివాస్, నేతశ్యాం, నారపాక నర్సయ్య, దేవేందర్, మురళి, సత్యనారాయణ, గంగాధర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వీడీసీ సభ్యులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో కొత్త లక్ష్యాలను ఏర్పర్చుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో వ్యాపార వేత్త ఫిరోజ్ తరాని, శ్యామ్, యూఆర్ఎస్ సిబ్బంది మల్లయ్య, వీణ, రుతిక పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అధికారి శ్రీకాంత్‌గౌడ్